సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా
బుధవారం । 17 । జనవరి । 2024



అష్టదళ పద్మారాధన

డాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనక మహలక్ష్మి దేవస్థానంలో స్వర్ణపుష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించారు.



ముగిసిన ధారోత్సవాలు

సింహగిరిపై ధారోత్సవాలు సోమవారంతో ఘనంగా ముగిశాయి. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. 8లో



గజేంద్రమోక్ష ఉత్సవం

శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామి గజేంద్ర మోక్షం(మకరవేట) ఉత్సవం మంగళవారం కనులపండువగా జరిగింది. 8లో

న్యూస్‌రీల్

పీవీటీజీలకు ఉచిత విద్యుత్‌పై అభినందనల వెల్లువ

సాక్షి,పాడేరు: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు జిల్లాలో 9,170 పీవీటీజీ గిరిజన కుటుంబాలకు విద్యుత్ సౌకర్యం కల్పించడంతో పాటు వారికి నాణ్యమైన ఉచిత విద్యుత్‌ను సమర్థంగా అందజేస్తున్న విద్యుత్ పంపిణీ సంస్థ అధికారులకు అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. అరకులోయ మండలంలోని కొత్తభల్లుగుడ ప్రాథమిక పాఠశాల ఆవరణలో సోమవారం జరిగిన పీఎం జన్‌మన్ కార్యక్రమంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ వర్చువల్ విధానంలో ఆదివాసీలతో మాట్లాడారు. ఆదివాసీ మహిళ స్వాబి గంగ అన్ని సంక్షేమ పథకాలతో పాటు ఆదివాసీలకు రాష్ట్ర ప్రభుత్వం అమలుజేస్తున్న ఉచిత విద్యుత్ గురించి సమగ్రంగా వివరించడంతో ప్రధాని సంతోషం వ్యక్తం చేశారు. అనంతరం ఐటీడీఏ పీవో వి.అభిషేక్, ఉమ్మడి విశాఖ జెడ్పీచైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర, పాడేరు ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మిలు విద్యుత్ పంపిణీ సంస్థ ఎస్ఈ ఎల్.మహేంద్రనాథ్,ఈఈ వి.డి.వి రామకృష్ణారావులను అభినందించి, పరిపూర్ణ విద్యుదీకరణ ధ్రువీకరణపత్రం అందజేశారు.

అనిత కుటుంబానికి సీఎం సహాయ నిధి



అనిత కుటుంబానికి రూ.5లక్షల చెక్కు అందజేస్తున్న అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ

సాక్షి,పాడేరు: అరకులోయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్‌గా పనిచేస్తూ 2022లో అనారోగ్యంతో మృతి చెందిన కిల్లో అనిత కుటుంబానికి సీఎం వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ఆర్థిక సాయం అందజేశారు. సీఎం సహాయ నిధి నుంచి మంజూరు చేసిన రూ.5లక్షల చెక్కును అరకులోయ ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ మంగళవారం పాడేరులో బాధిత కుటుంబానికి అందజేశారు. పీవీటీజీ తెగకు చెందిన అనితను అరకు మార్కెట్ కమిటీ చైర్మన్‌గా నియమించడంలో అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ కృషి చేశారు. ఆమె అకాల మరణంతో ఆమె కుమారుడు రాజారమేష్‌ను మార్కెట్ కమిటీ చైర్మన్‌గా నియమించారు. ప్రభుత్వం తరఫున ఆర్థిక సాయం అందించాలని వైఎస్సార్‌సీపీ రీజినల్ కోఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డికి అరకు ఎమ్మెల్యే విజ్ఞప్తి చేశారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రూ.5 లక్షల ఆర్థిక సాయం మంజూరు చేయడంతో కృతజ్ఞతలు తెలిపారు. అరకు మార్కెట్ కమిటీ చైర్మన్ కిల్లో రాజారమేష్, బాలు మాస్టార్, వైఎస్సార్‌సీపీ నేత కిల్లో రామన్న పాల్గొన్నారు.

అప్పన్న సన్నిధిలో కేంద్ర న్యాయశాఖ మంత్రి



అప్పన్న సన్నిధిలో కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్‌రామ్ మేఘవాల్

సింహాచలం: శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామిని సోమవారం కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘవాల్ దర్శించుకున్నారు. ఆలయ ధ్వజస్తంభం వద్ద ఆయనకు దేవస్థానం ఈవో శ్రీనివాసమూర్తి, అర్చకులు స్వాగతం పలికారు. అనంతరం ఆయన ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకుని బేడా మండపంలో ప్రదక్షిణ చేశారు. అంతరాలయంలో ఆయ న పేరిట అర్చకులు స్వామికి పూజలు చేసి, వేద ఆశీర్వచనం అందజేశారు. ఆలయ సంప్రదాయం ప్రకారం ఆయనకు స్వామివారి ప్రసాదం, జ్ఞాపిక ఈవో అందజేశారు. మంత్రి వెంట రాజ్యసభ సభ్యుడు జీవీఎల్ నరసింహారావు ఉన్నారు.

మెరైన్ పార్క్ ఎగ్జిబిషన్ ప్రారంభం

ఏయూ క్యాంపస్: బీచ్ రోడ్డులోని సబ్ మెరైన్ ఎదురుగా పోలీస్ మెస్ వెనక ఉన్న ఏయూ మైదానంలో ఏర్పాటు చేసిన మెరైన్ పార్క్ ఎగ్జిబిషన్‌ను మంగళవారం ఏయూ మాజీ వీసీ ఆచార్య ప్రసాద్‌రెడ్డి కుమార్తె ప్రీతి ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వాహకుడు రాజారెడ్డిమాట్లాడుతూ అంతర్జాతీయ ప్రమాణాలతో స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించిన ప్రదర్శన సందర్శకులను ఎంతగానో అలరిస్తుందని చెప్పారు. సముద్ర అంతర్భాగంలో 10 వేల అడుగుల లోతున ఉండే రకరకాల చేపలు ఈ ప్రదర్శనలో ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయన్నారు. పూర్తి సెంట్రల్ ఏసీ సౌకర్యంతో టన్నెల్ అక్వేరియంలో 150 జాతులకు చెందిన 60 వేల విదేశీ, స్వదేశీ చేపలను అందుబాటులో ఉంచామన్నారు.

ఉరికే ఉత్సాహం.. ఊరూరా సంబరం

సంక్రాంతి సంబరాలను జిల్లా వాసులు ఉత్సాహంగా నిర్వహిస్తున్నారు. భోగి నాడు మొదలైన వేడుకలు హుషారుగా సాగుతున్నాయి. బంధువులు, స్నేహితుల రాకతో గ్రామాలు కళకళలాడాయి. గుండెలు ఉప్పొంగేలా ఉత్సాహంగా ఉత్సవాలు జరుగుతున్నాయి... గూడేలు ఆనందంతో చిందులేస్తున్నాయి... థింసా నృత్యాలు, డప్పు వాయిద్యాలతో పల్లెలు హోరెత్తుతున్నాయి. జిల్లాలో పది రోజుల పాటు ఈ సంబరాలు నిర్వహిస్తారు.



థింసా నృత్యం చేస్తున్న గిరిజన మహిళలు

- హోరెత్తిన సంక్రాంతి సంబరాలు
- థింసా నృత్యాలు, డప్పు వాయిద్యాలు, సాంస్కృతిక ప్రదర్శనలతో సందడి



వంజరిలో ఈశ్వరరావు బృందం ప్రదర్శిస్తున్న తోలుబొమ్మలాట



ఆవుకు పూజలు చేస్తున్న గిరిజనులు

సాక్షి,పాడేరు : జిల్లా వ్యాప్తంగా సంక్రాంతి సంబరాలు హుషారుగా జరుగుతున్నాయి. అన్ని వర్గాల ప్రజలు సంక్రాంతి సంబరాల్లో మునిగితేలుతున్నారు. ఏజెన్సీలో ప్రతి ఏడాది పది రోజుల పాటు సంక్రాంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తారు. భోగి మొదలుకొని ఈ నెలాఖరు వరకు సంక్రాంతి సంబరాలు జరుగుతాయి. భోగి, సంక్రాంతి, కనుమ పండగలను గిరిజనులు భక్తి శ్రద్ధలతోజరుపుకొన్నారు. సోమవారం శంకుదేముడికి పూజలు చేయడంతో పాటు పెద్దల సమాధుల వద్ద పూజలు జరిపారు. కనుమ రోజు పాడి పశువులకు ప్రత్యేక పూజలు చేసి, వాటికి వంటకాలను తినిపించారు. డప్పు వాయిద్యాలు, థింసా నృత్యాల మధ్య పండగను ఘనంగా నిర్వహించారు. బూడియాల వేషధారణలో యువతీయువకులు గ్రామాల్లో డ్యాన్స్‌లతో సందడి చేస్తున్నారు.

తోలుబొమ్మలాట..

జి.మాడుగుల: హైటెక్ కాలంలోనూ తోలుబొమ్మలాటకు ఏమాత్రం ఆదరణ తగ్గలేదు. సంక్రాంతి పండగ సందర్భంగా పలు గ్రామాల్లో జరుగుతున్న జాతరల్లో తోలుబొమ్మల ప్రదర్శనలు నిర్వహిస్తున్నారు. పెద్ద ఎత్తున గ్రామస్తులు వీటిని ఉత్సాహంగా తిలకిస్తున్నారు. వీటికి రోజురోజుకు ఆదరణ పెరుగుతోంది. సంక్రాంతి సందర్భంగా మండలంలోని వంజరి గ్రామంలో సోమవారం రాత్రి జర్తా ఈశ్వరరావు బృందం తోలుబొమ్మలు ప్రదర్శన నిర్వహించింది.

నేటి నుంచి కాటమస్వామి జాతర



కాటుమల్లేశ్వరస్వామి విగ్రహాలు

గంగవరం: మొల్లేరు పరిసర గ్రామాల ఆరాధ్య దైవాలు, కోరిన కోర్కెలు తీర్చే కాటుమల్లేశ్వర స్వామి (కాటమస్వామి), బంగారు పాపాయమ్మ తల్లి మహోత్సవాలు బుధవారం నుంచి ఘనంగా ప్రారంభంకానున్నాయి. ఈ నెల 21వరకు కాటమస్వామి జాతరను నిర్వహించేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. గంగవరం మండలం శివారు గ్రామమైన మొల్లేరు - బి.శివరామపట్నం గ్రామాల మధ్య వెలసిన కాటుమల్లేశ్వర స్వామి, గ్రామదేవత బంగారు పాపాయమ్మ తల్లి ఉత్సవాలను ప్రతి ఏటా జనవరిలో అత్యంత వైభవంగా నిర్వహిస్తారు. కనుమ రోజు రాత్రి గ్రామంలో జాగరణ నిర్వహిస్తారు. స్వామివారి గరగలు, తాడి పెద్దు, భజనలతో ఊరేగింపుగా గుడి చేరుకుంటారు. ముక్కనుమ రోజు నుంచి ఐదు రోజుల జాతర నిర్వహిస్తారు. దివంగత మాదేపల్లి శ్రీరామ్మూర్తి 1955లో ఈ ఆలయాలను నిర్మించి కాటుమల్లేశ్వర స్వామి(కాటమస్వామి), బంగారు పాపాయమ్మ తల్లి విగ్రహాలను ప్రతిష్టించారు. అనాటి నుంచి మొల్లేరు-మల్లవరం పరిసర గ్రామాల ప్రజలు భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహిస్తున్నారు. కాటుమల్లేశ్వర స్వామి, బంగారు పాపాయమ్మ సోదరీసోదరులని మొల్లేరు వాసులు తెలిపారు. వారిని పూజిస్తే ఈ ప్రాంతం సస్యశ్యామలంగా ఉంటుందని, కుటుంబాలు సిరిసంపదలు, ఆనందంతో ఉంటాయని వీరి విశ్వాసం. ఏటా ఇక్కడ నిర్వహించే జాతరను మాదేపల్లి వారి వారసులు ఆధ్వర్యంలో గ్రామస్తులు నిర్వహిస్తున్నారు. మొల్లేరు చుట్టు పక్కల గ్రామాల వారు స్వామి మొక్కులు తీర్చుకుంటారు. తమ సంతానానికి కాటమస్వామి పేరు పెట్టుకోవడం ఆనవాయితీ. స్వామిని తలుచుకుని ఏ పని చేసినా విజయం వరిస్తుందని భక్తుల నమ్మకం. ఏటా మొల్లేరులో మహోత్సవాలను అత్యంత ఘనంగా నిర్వహిస్తారు. జాతర ఐదురోజుల పాటు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఆలయాల అభివృద్ధికి జాతర నిర్వాహకులు కృషి చేయాలని భక్తులు కోరుతున్నారు.

ఘనంగా చెన్నకేశ్వర స్వామి ఊరేగింపు



ఊరేగింపులో పాల్గొన్న భక్తులు

కూనవరం: మండల కేంద్రంలో మకర సంక్రాంతి పర్వదినం సందర్భంగా సోమవారం చెన్నకేశ్వర స్వామి ఊరేగింపును ఘనంగా నిర్వహించారు. భక్తులు తెల్లవారు జాము నుంచి శబరి, గోదావరి నదుల సంగమంలో పుణ్యస్నానాలు ఆచరించి స్వామి వారి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతం స్వామి వారిని మేళతాళాలు, మంగళ వాయిద్యాల నడుమ తిరువీధి నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు చెన్నకేశ్వర స్వామి వారికి అడుగడుగునా హారతులిస్తూ, కొబ్బరి కాయలు కొట్టి, నైవేద్యం సమర్పించారు. ఏటా సంప్రదాయంగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమాన్ని ఈ ఏడాది లక్ష్మీకాంతం దంపతులు నిర్వహించారు. తిరువీధి సేవలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

పర్యాటకులు ఫుల్ జోష్



చాపరాయి వద్ద పర్యాటకుల సందడి



కొత్తపల్లి జలపాతం వద్ద సందడి చేస్తున్న సందర్శకులు



గుడిసె హిల్ స్టేషన్‌లో సూర్యోదయం చూసేందుకు వేచి ఉన్న పర్యాటకులు

సాక్షి,పాడేరు/జి.మాడుగుల/డుంబ్రిగుడ/రంపచోడవరం: జిల్లాలో పలు పర్యాటక ప్రాంతాలు సందర్శకులతో కిటకిటలాడాయి. సంక్రాంతి సందర్భంగా వరుస సెలవులు రావడంతో టూరిస్టులు అధిక సంఖ్యలో వచ్చి సందడి చేశారు. ఎత్తునుంచి పడుతున్న జలధారల వద్ద ఉత్సాహంతో జలకాలాడారు. మంచులో తడుస్తూ మురిసిపోతూ టూరిస్టు స్పాట్‌లను సందర్శించారు. నులివెచ్చని సూర్య కిరణాలు మేనిని తాకుంటే, మరో వైపు చలి వణికిస్తూ ఉండగా సూర్యోదయం అందాన్ని తిలకిస్తూ మైమరిచిపోయారు. బంగారు వర్ణంలోని లేలేత భానుని కిరణాలు నేలను తాకుతున్న సమయంలో ఆవిష్కృతమైన మహోన్నత సౌందర్యాన్ని ఆస్వాదిస్తూ ఆనందడోలికల్లో తేలియాడారు. మారేడుమిల్లి, మోతుగూడెం, సీలేరు, లంబసింగి, తాజంగి, వంజంగి, సీతమ్మకొండ, మాడగడ హిల్స్, అరకులోయ, అనంతగిరి, బొర్రాగుహలు తదితర పర్యాటక ప్రాంతాలలోను రద్దీ నెలకొంది. కొత్తపల్లి, చాపరాయి జలపాతాలకు వివిధ ప్రాంతాల నుంచి పర్యాటకులు పోటెత్తారు. సోమ, మంగళవారాల్లో రెండు తెలుగు రాష్ట్రాలు, పక్కనే ఉన్న ఒడిశా రాష్ట్రంలో పలు ప్రాంతాల నుంచి టూరిస్టులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. పెద్దపెద్ద బండరాళ్లపై నుంచి జాలువారే నీటి ప్రవాహంలో గంటల తరబడి జలకాలాడుతూ సందడి చేశారు. కుటుంబ సభ్యులు, స్నేహితులతో ఆటపాటలతో ఎంజాయ్ చేశారు. ప్రముఖ పర్యాటక ప్రాంతమైన గుడిసెకు సంక్రాంతి రోజు వేలాదిగా పర్యాటకులు తరలివచ్చారు. గుడిసె హిల్ స్టేషన్‌లో రాత్రి బస చేసే అవకాశం లేకపోడంతో పర్యాటకులు మారేడుమిల్లి, ఆకుమామిడికోట, రిసార్ట్స్, అతిథి గృహాల్లో బస చేసి రాత్రి 2 గంటల సమయంలో గుడిసె అందాలు చూసేందుకు తరలివెళ్లారు.

కొత్తపల్లి జలపాతాన్ని సందర్శించిన రాష్ట్ర సమాచార కమిషనర్



జలపాతం వద్ద కుటుంబ సభ్యులతో రాష్ట్ర సమాచార కమిషనర్ చెన్నారెడ్డి

జి.మాడుగుల: కొత్తపల్లి జలపాతాన్ని మంగళవారం రాష్ట్ర సమాచార కమిషనర్ కాకర్ల చెన్నారెడ్డి కుటుంబ సభ్యులతో సందర్శించారు. ఇక్కడ చల్లటి వాతావరణాన్ని వారు ఆస్వాదించారు. జలపాతం వ్యూపాయింట్ వద్ద, పలు చోట్ల సెల్ఫీలు తీసుకున్నారు. కొత్తపల్లి వాటర్ ఫాల్స్ సూపర్‌వైజర్ వంతాల అభి, రెవెన్యూ సిబ్బంది సమాచార కమిషనర్‌కు ఈ ప్రాంతం గురించి వివరించారు.

మోదమ్మకు ప్రత్యేక పూజలు



మోదమ్మకు పూజలు చేస్తున్న సినీ దర్శకుడు పరశురామ్ కుటుంబ సభ్యులు



పూజలు చేస్తున్న గ్రామ/వార్డు సచివాలయాల అడిషనల్ కమిషనర్ స్వామి నారాయణ

సాక్షి,పాడేరు: ఉత్తరాంధ్ర ప్రజల ఆరాధ్యదైవం పాడేరులోని మోదకొండమ్మతల్లి ఆలయానికి భక్తుల తాకిడి అధికంగా ఉంది. సంక్రాంతి పండగ సందర్భంగా పలు ప్రాంతాలకు చెందిన భక్తులు భారీగా తరలివచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంగళవారం గ్రామ వార్డు సచివాలయాల విభాగం రాష్ట్ర అడిషనల్ కమిషనర్ స్వామినారాయణ, సినీ దర్శకుడు పరశురామ్ కుటుంబ సభ్యులతో కలిసివచ్చి మోదకొండమ్మతల్లిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ కమిటీ ప్రతినిధి కొట్టగుళ్లి రామారావు ఇతర ప్రతినిధులు వారికి ఘనంగా సన్మానించి, మోదమ్మ చిత్రపటాలను అందజేశారు.

బైక్, ఆటోలను ఢీ కొట్టిన వ్యాన్

ఆరుగురికి తీవ్రగాయాలు

ముంచంగిపుట్టు: మండల కేంద్రం ముంచంగిపుట్టు నుంచి పెదబయలు వెళ్తున్న ఆటో, బైక్‌లను కిలగాడ జంక్షన్ సమీపంలో ముంచంగిపుట్టు వైపు వస్తున్న బొలెరో వ్యాన్ ఢీకొంది. ఆటో,బైకులపై ప్రయాణిస్తున్న వారు తీవ్రంగా గాయపడ్డారు. ఆ రెండు వాహనాలు నుజ్జయ్యాయి. క్షతగాత్రులను స్థానికులు హుటాహుటిన ముంచంగిపుట్టు సీహెచ్‌సీకి తరలించారు. స్థానిక వైద్యాధికారి సంతోష్ క్షతగాత్రులకు వైద్య సేవలు అందించారు. ఆటోలో ప్రయాణిస్తున్న మండలంలోని వనభసింగి పంచాయతీ తడపల్లి గ్రామానికి చెందిన కొర్రా సుశీల, లతమ్మ, రాజు, బుజ్జిబాబు, బైక్‌పై ప్రయాణిస్తున్న సింగోయి సేవాగ్, గంపరాయి రామ్‌లీలా విద్యాసాగర్‌లకు తీవ్ర గాయాలయ్యాయి. మరో ఎనిమిది మంది స్వల్పగాయాలతో బయటపడ్డారు. తీవ్రంగా గాయపడిన వారిని అంబులెన్స్‌లో పాడేరు జిల్లా ఆస్పత్రికి తరలించారు. వ్యాన్ డ్రైవర్ నిర్లక్ష్యం వల్లే ప్రమాదం జరిగిందని క్షతగాత్రులు తెలిపారు. బాధితుల కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ రవీంద్ర తెలిపారు.



ప్రమాదానికి గురైన వాహనాలు



ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన విద్యాసాగర్

కడక్‌నాథ్ కోడి..కిరాక్ రాబడి

- పెంపకంతో మంచి లాభాలు
- కేవీకే ద్వారా గిరిజన మహిళలకు పంపిణీ
- ఐదేళ్ల కాలంలో పదివేల పిల్లలు అందజేత



కడక్ నాథ్ కోళ్లు

రంపచోడవరం: నాటు కోళ్ల పెంపకం లాభదాయకమైన వ్యాపారంగా మారింది. ఒకప్పుడు గ్రామాల్లో చిన్న, సన్నకారు రైతులు, భూమిలేని వ్యవసాయ కూలీలు ఈ కోళ్ల పెంపకాన్ని వ్యాపకంగా చేపట్టి తమ ఉపాధికి చేదోడు వాదోడుగా కొంత సొమ్ము సంపాదించుకునేవారు. అయితే ప్రస్తుతం నాటుకోడి మాంసానికి డిమాండ్ బాగా పెరగడంతో పెరటి కోళ్ల పెంపకం సైతం నేడు ప్రత్యేక కుటీర పరిశ్రమలా మారింది. ఈ క్రమంలో నాటు కోడిని తలదన్నేలా కడక్ నాథ్ ఒక ప్రత్యేక జాతి కోడి మార్కెట్లోకి ప్రవేశించి అందరి దృష్టిని విపరీతంగా ఆకర్షిస్తోంది.గిరిజనులు పెంచుకునేందుకు ఏటా కడక్ నాథ్ కోళ్లను కృషి విజ్ఞాన కేంద్రం అధికారులు ఉచితంగా అందజేస్తున్నారు. మంచి రాబడి వస్తుండడంతో ఈ కోళ్ల పెంపకంపై గిరిజనులు ఆసక్తి చూపుతున్నారు.

కడక్‌నాథ్ కోళ్ల ప్రత్యేకతలు ..

అత్యంత పోషక విలువలు, రోగ నిరోధక శక్తి కలిగిన భారతీయ పెరటి జాతి నాటు కోడి. ఇది ఇప్పుడు దేశవ్యాప్తంగా అత్యంత ప్రాచుర్యం పొందుతోంది. వీటి స్వస్థలం మధ్యప్రదేశ్‌లోని లోకాలిమాసి. ఇప్పటివరకు ఇది మధ్యప్రదేశ్, రాజస్థాన్,గుజరాత్లోని కొన్ని ప్రాంతాల్లో మాత్రమే దొరికే స్థానిక జాతికి చెందిన నాటుకోడిగానే ఉంది. ఆయా రాష్ట్రాల్లో నివసించే గిరిజనులు, కొండ జాతులు, ఆదివాసి ప్రజలు, గ్రామీణ ప్రాంతాల వారే ఈ కోళ్లను పెంచావారు. దీని ప్రత్యేకతల దృష్ట్యా అంతరించి పోతున్న నాటు కోడికి ప్రత్యామ్నాయంగా ఈ కోళ్లను కూడా పెంచవచ్చని శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు.

ఏటా రెండు వేల కోడి పిల్లల పంపిణీ

రంపచోడవరం కృషి విజ్ఞాన కేంద్రం ద్వారా గత ఐదేళ్ల నుంచి ఏటా రెండు వేల కోడిపిల్లల చొప్పున గిరిజన మహిళలకు పంపిణీ చేస్తున్నారు.ఇప్పటి వరకు పది వేల కోడి పిల్లలను అందజేశారు. ముదురు నలుపు, ముదురు నీలం రంగుల్లో ఉండే కడక్‌నాథ్ కోళ్లలో వెంట్రుకలు, చర్మం, మాంసంతో పాటు రక్తం కూడా నల్లగానే ఉంటుంది. ఈ కోళ్లను కాలామాశి అని కూడా పిలుస్తారు. అరుదుగా, కొన్ని పుంజులు నలుపుతో పాటు బంగారు రంగు ఈకలు కలిగి ఉంటాయి. ఈ కోడి పిల్లలు నీలం రంగు మొదలుకొని నలుపు వరకు ఉండి, వీపు మీద ముదురు రంగు గీతలు ఉంటాయి. అయితే ఇదే జాతి కోడి మరో రెండు రంగుల్లోనూ లభిస్తుంది. నల్లని జాతి జెట్ బ్లాక్ రకానికి చెందినవి కాగా, ఇవి ఇంకా గోల్డెన్ అనే మరో రెండు రంగుల్లోనూ లభ్యమవుతాయి. కడక్ నాథ్ కోళ్లకు రోగనిరోధక శక్తి ఎక్కువ. ప్రతికూల వాతావరణ పరిస్థితులను తట్టుకోగలవు. ఈ జాతి కోళ్లలో పొదుగుడు లక్షణం తక్కువ. ఆరు నెలల వయసు నుంచే గుడ్లు పెట్టడం ప్రారంభిస్తాయి. ఒక్కో కోడి వేసవిలో సుమారు 100 గుడ్లు పెడుతుంది. 7 నెలల వ్యవధిలో ఈ కోడి కేవలం 1.5 కేజీల బరువు మాత్రమే పెరుగుతుంది.

మాంసం ఎంతో ఆరోగ్యకరం

కడక్‌నాథ్ కోడి మాంసం ఎంతో ఆరోగ్యకరంగా ఉండడానికి కారణం ఈ కోడి శరీరంలో చాలా తక్కువ కొవ్వు ఉంటుంది. దీని మాంసంలో 25 శాతం మాంసకృత్తులు ఉంటాయి. బాయిలర్ కోడి మాంసంతో పోలిస్తే కడక్‌నాథ్ కోడిలో కొలెస్ట్రాల్ శాతం చాలా తక్కువ. పైగా దీని మాంసంలో 18 రకాల అమైనో ఆసిడ్స్, విటమిన్లు (బి1, బి2, బి3, బి12), కాల్షియం, ఫాస్ఫరస్ ఉంటాయి. ఈ కోడి మాంసం హృద్రోగులకు మేలు చేయడమే కాకుండా గుండెకు రక్త సరఫరా పెంచుతుంది. వయాగ్రాలోని సిల్డెనాఫిల్ సిట్రిక్ రక్త సరఫరా పెంచడం ద్వారా సెక్స్ సామర్థ్యం పెంచుతుంది. అదే గుణం ఈ మాంసానికి, రక్తానికి ఉందంటారు. మెలనిన్ అనే పదార్థం ఈ కోడి మాంసంలో ఉండటం వల్ల మహిళలు అధిక రక్త స్రావం, గర్భస్రావం, ప్రసవానంతర సమస్యల నుంచి బయటపడవచ్చు.

మరిన్ని ఔషధ గుణాలు

పాస్ఫరస్, ఇనుము వంటి ధాతువులు మానవ శరీరానికి ఎంతో అవసరమైనవి.



కడక్‌నాథ్ కోడి పిల్లలను పంపిణీ చేస్తున్న కేవీకే కోఆర్డినేటర్ లలితాకామేశ్వరి

ఈ కోడి మాంసంలో ఇనుప ధాతువు బి2 అధికంగా ఉండటం వల్ల న్యూమోనియా, ఎనీమియా, క్షయ, ఆస్తమా వ్యాధుల నివారణకు కడక్‌నాథ్ కోడి మాంసం మంచి ఆహారంగా పనిచేస్తుంది. వాటితో పాటు అనేక స్థూల, సూక్ష్మధాతువులు కలిగి ఉండడం వల్ల కీళ్ల సమస్యలు, ఎముకలు విరిగిన వారికి ఇది అద్భుత ఆహారం. శరీరానికి అవసరమైన ఓమోగా ఆమూల ఫాటో యాసిడ్ ప్రతిరూపమైన లినోలెనిక్ యాసిడ్ ఈ కోడి మాంసంలో ఉండటం ప్రత్యేకతగా చెప్పవచ్చు. వీటి గుడ్లని నీరసం, ఆస్తమా, మూత్రపిండాల సంబంధిత వ్యాధులను తగ్గించడానికి వాడుతారు.

కేవీకేలో నెలరోజులు పెంచిన తరువాత...



హైదరాబాద్ జాతీయ కోళ్ల పరిశోధన స్థానం నుంచి ఒక రోజు వయస్సు కలిగిన కోడి పిల్లలు తీసుకువచ్చి నెల రోజుల పాటు ఫీడ్, టీకాలు, బ్రూడింగ్ విధానం చేపట్టి గిరిజన మహిళలకు ఇస్తాం.కొక్కెర, మ్యారెక్స్, పారుడు వంటి వ్యాధులకు టీకాలు వేసి అందజేస్తున్నాం.అజుల్లా పెట్టడం ద్వారా మంచి ఫలితాలు వస్తున్నాయి.

–కె వీరాంజనేయులు, కేవీకే శాస్త్రవేత్త, పందిరిమామిడి

కోళ్ల పెంపకంతో అదనపు ఆదాయం



కృషివిజ్ఞాన కేంద్రం నుంచి పది కోడి పిల్లలు తెచ్చుకున్నాను. కోళ్ల పెంపకం ద్వారా అదనపు ఆదాయం వస్తుంది. ఇంటి అవసరాలకు సరిపడా ఆదాయం సంపాదించుకోవచ్చు.గిరిజన మహిళాల అభివృద్ధికి కేవీకే సంస్థ కృషి చేస్తోంది.

– సుంకం బేబీ,
నిమ్మలపాలెం, రంపచోడవరం మండలం

పోటెత్తిన భక్తజన కొండ

- జిల్లా నలుమూలల నుంచి తరలివచ్చిన జనం
- ఘనంగా బౌద్ధ మేళా.. జాతర నిర్వహణ



కొండపైకి యాత్రగా వెళ్తున్న బౌద్ధ భిక్షువులు, భక్తులు

తుమ్మపాల: తీర్థానికి వచ్చిన జనసందోహంతో బొజ్జన్నకొండపై సంక్రాంతి సందడి కనిపించింది. కనుమ సందర్భంగా మంగళవారం ప్రముఖ పర్యాటక కేంద్రం బొజ్జన్నకొండపై తీర్థం వైభవంగా నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి సందర్శకులు అధిక సంఖ్యలో తరలిరావడంతో కొండ జనంతో నిండిపోయింది. పిల్లలతో పాటు పెద్దలు కుటుంబ సమేతంగా వచ్చి బౌద్ధ స్తూపాలను దర్శించుకుని కొండపై గల గుహలు, పురాతన విద్యాబోధన శాలను సందర్శించారు. సమీపంలో గల లింగాల కొండపై కూడా జనంతో కిటకిటలాడింది. చుట్టూ పంట పొలాల్లో ఏర్పాటు చేసిన రంగుల రట్నాలు, చిన్నారుల ఆట స్థావరాలు, బొమ్మల దుకాణాలతో సందడి నెలకొంది. ఎటువంటి ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా డీఎస్పీ సుబ్బరాజు, ట్రెయినీ డీఎస్పీ భవ్య రెడ్డి, సీఐ రవికుమార్ ఆధ్వర్యంలో గట్టి పోలీస్ బందోబస్తు నిర్వహించారు. ఉదయం బొజ్జన్నకొండపై జరిగిన బౌద్ధమేళాలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన బౌద్ధ భిక్షువులు పాల్గొన్నారు.

బౌద్ధమార్గం అనుసరణీయం

తుమ్మపాల: ప్రపంచ శాంతిని నెలకొల్పే ధర్మమార్గమే బౌద్ధమని, గాంధీజీ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బుద్ధుని మార్గాలను అనుసరించే స్వాతంత్ర్యాన్ని సాధించి రాజ్యాంగాన్ని రూపొందించారని ఎంపీ బి.వి.సత్యవతి అన్నారు. బొజ్జన్నకొండ వద్ద మంగళవారం విశాఖ బౌద్ధ సంఘాల సమాఖ్య అంబేడ్కర్ బుద్ధ విహార్ ఆధ్వర్యంలో నిర్వహించిన బౌద్ధమేళాలో ఆమె మాట్లాడారు. ప్రపంచాన్ని శాంతిమార్గంలో నడపాలంటే బుద్ధుని పంచశీల సూత్రాలతోనే సాధ్యమన్నారు. నూతన జిల్లా అనకాపల్లికి కేరాఫ్‌గా బొజ్జన్న కొండను మరింత అభివృద్ధి చేయాలన్న నిశ్చయంతో రూ.1.5 కోట్ల ఎంపీ నిధులతో కొండ నుంచి జాతీయ రహదారి వరకు రెండు కిలోమీటర్ల పొడవు గల రోడ్డును అత్యంత పటిష్టంగా నిర్మించామన్నారు. టీడీపీ ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగానే రాష్ట్రంలో బౌద్ధారామాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన రూ.24 కోట్ల నిధులు వెనక్కి వెళ్లిపోయాయని, సీఎం జగన్‌మోహన్‌రెడ్డి కృషి మూలంగానే మరిన్ని నిధులతో రూ.35 కోట్లు మంజూరయ్యాయన్నారు. అందులో రూ.7.5 కోట్లతో బొజ్జన్నకొండగా రూపురేఖలు పూర్తిగా మారనున్నాయన్నారు. ఏ ప్రాణికి హాని చేయక శాంతి మార్గంలో నడిచే బౌద్ధమతాన్ని అంబేడ్కర్ అనుసరించారని, ఆయన ఆశయ సాధన దిశగా ప్రజాపాలన చేస్తున్న సీఎం జగన్ దేశ చరిత్రలో నిలిచిపోయే విధంగా విజయవాడలో ఈ నెల 19న 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్నారని తెలిపారు. బౌద్ధ ప్రముఖులు గుణుపూడి బాబులు, విశాఖ బౌద్ధ సంఘాల సమాఖ్య ప్రధాన కార్యదర్శి బోర వేణుగోపాల్ గౌతమ్, అంబేడ్కర్ మెమోరియల్ సొసైటీ అధ్యక్షుడు బొద్దు కళ్యాణరావు, మాటూరి శ్రీనివాస్ మాట్లాడారు. అంతకుముందు జిల్లా మహాబోధి సొసైటీ ఆధ్వర్యంలో ప్రముఖ బౌద్ధ భిక్షువులు (నాగపూర్) వెనరబుల్ డాక్టర్ జ్ఞానదీప్ మహాథేరో, వెనరబుల్ బోధిరత్న మహాదేరో బౌద్ధ పతాకావిష్కరణ చేసి బొజ్జన్నకొండపై గల బౌద్ధస్తూపం వరకు పంచశీల శాంతియాత్ర చేపట్టారు.



బొజ్జన్నకొండ ఎక్కుతున్న సందర్శకులు

నేత్రపర్వంగా
వెంకన్న గిరి ప్రదక్షిణ



స్వామివారిని గిరి ప్రదక్షిణకు తీసుకెళ్తున్న దృశ్యం

- గరుడాద్రి చుట్టూ పోటెత్తిన భక్త జనం



ఉభయ దేవేరులతో స్వామివారు

నక్కపల్లి: ప్రాచీన పుణ్యక్షేత్రం ఉపమాక వెంకన్న గిరి ప్రదక్షిణ కార్యక్రమం మంగళవారం నేత్రపర్వంగా జరిగింది. దశావతారాల్లో పదో అవతారమైన కల్కి రూపంలో స్వామివారు స్వయం వ్యక్తమై కొలువుదీరిన గరుడాద్రి పర్వతం చుట్టూ ఈ కార్యక్రమాన్ని ప్రతి ఏటా కనుమనాడు జరుపుతారు. శ్రీదేవి భూదేవి సమేతుడైన శ్రీవేంకటేశ్వరస్వామిని పుణ్యకోటి వాహనంపై ఉంచి, గరుడాద్రి పర్వతం చుట్టూ ప్రదక్షిణ నిర్వహించారు. స్వామివారిని ఉత్సవమూర్తులను ఉంచిన వాహనాన్ని మోసేందుకు వందలాది మంది భక్తులు పోటీపడ్డారు. ఈ కార్యక్రమానికి ముందు ఆలయ ప్రధానార్చకులు గొట్టుముక్కల వరప్రసాద్ స్వామివారికి నిత్యార్చనలు, బాలభోగ నివేదన, రాజభోగ నివేదన, విశేష పూజలు నిర్వహించారు. ఉత్సవమూర్తులను కడియం నుంచి తెచ్చిన పూలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. సాయంత్రం గిరి ప్రదక్షిణ ప్రారంభమైంది. స్వామివారి వాహనంతోపాటు వందలాదిమంది గరుడాద్రి పర్వతం చుట్టూ తిరిగారు. అనంతరం బంధుర సరస్సు వద్ద ఉన్న మండపంలో స్వామివారికి విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం నిర్వహించారు. అనంతరం కరిమకర సంవాద కార్యక్రమం జరిగింది. భక్తులు పెద్ద ఎత్తున పోటీ పడి అరటి గెలలు స్వామివారికి కానుకగా సమర్పించుకున్నారు. గిరిప్రదక్షిణలో ఉపమాక శ్రీనివాస భక్తసమాజం సభ్యులు భజనగీతాలు ఆలపించారు. టీటీడీ వారు ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేసి స్వామివారి దర్శనం కల్పించారు.

ఏకాగ్రతతో డ్రైవింగ్ చేయండి



మాట్లాడుతున్న ఎస్‌ఐ దివాకర్

నర్సీపట్నం: ఏకాగ్రతతో డ్రైవింగ్ చేయటం వల్ల రోడ్డు ప్రమాదాలకు ఆస్కారం ఉండదని టౌన్ ఎస్సై సుధాకర్ పేర్కొన్నారు. రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా స్థానిక ఆర్టీసీ డిపోలో డ్రైవర్లకు రోడ్డు ప్రమాదాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ ఆర్టీసీ డ్రైవర్లు విధిగా రోడ్డు భద్రతా నియమాలు పాటించాలన్నారు. ఎదురుగా వచ్చే వాహనం పరిస్థితిని అంచనా వేయాలన్నారు. డిపో మేనేజర్ ధీరజ్ మాట్లాడుతూ డ్రైవర్లు సాధ్యమైనంత వరకు డ్యూటీ దిగిన అనంతరం విశ్రాంతి తీసుకోవాలన్నారు. వందల మంది ప్రాణాలు డ్రైవర్ చేతిలో ఉంటాయన్నారు. మీ కుటుంబం మీపై ఆధారపడిన విషయాన్ని దృష్టిలో పెట్టుకుని బస్సులు నడపాలన్నారు. కార్యక్రమంలో డిపో గ్యారేజ్ అసిస్టెంట్ ఇంజనీర్ పి.ఆచారి, అసిస్టెంట్ మేనేజర్ నాయుడు, అసోసియేషన్ నాయకులు, డ్రైవర్లు, గ్యారేజ్ సిబ్బంది పాల్గొన్నారు.

వడ్డాదిలో యువకుల మధ్య ఘర్షణ



గాయపడిన తేజ

బుచ్చెయ్యపేట: మండలంలో వడ్డాది యువకుల మధ్య చోటు చేసుకున్న ఘర్షణలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. కనుమ పండగ సందర్భంగా మంగళవారం వడ్డాదికి దూరంగా కొంతమంది గుట్టుచప్పుడు కాకుండా కోడి పందేలు నిర్వహించారు. అక్కడకు వెళ్లిన రెల్లివీధి, దొరబాబు కాలనీ యువకులు గొడవ పడ్డారు. ఇదే విషయమై రాత్రి వడ్డాది జంక్షన్‌లో సినిమా హాలు దగ్గర రెల్లివీధి యువకుడిపై దొరబాబు కాలనీ యువకులు దాడి చేశారు. కోడి కత్తితో దాడి చేయడంతో రెల్లివీధి యువకుడు తేజ మెడపై గాయమైంది. తీవ్ర రక్తస్రావమైన అతడ్ని స్థానికులు చోడవరం ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్చారు. పరిస్థితి విషమంగా ఉండటంతో విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. దీంతో రెల్లివీధి యువకులు వడ్డాది బీఎన్ రోడ్డుపైకి వచ్చి ఆందోళన చేసి సినిమాహాలు, ఇతర దుకాణాలు మూయించడానికి ప్రయత్నించారు. పోలీసులు, నాయకులు సర్దిచెప్పడంతో ఆందోళన విరమించారు. దీనిపై ఎస్ఐ డి. ఈశ్వరరావును వివరణ కోరేందుకు ప్రయత్నించగా, ఆయన అందుబాటులో లేరు.

ఉత్తరాయణ పుణ్యకాలంలో ప్రత్యేక పూజలు

- ఉపమాక వెంకన్న ఆలయానికి భక్తుల తాకిడి
- శేషతల్పవాహనంపై స్వామివారికి తిరువీధి సేవ



స్వామివారికి తిరువీధి సేవలు నిర్వహిస్తున్న దృశ్యం

నక్కపల్లి : ఉత్తరాయణ పుణ్యకాలం ప్రారంభం కావడంతో ప్రాచీన పుణ్యక్షేత్రం ఉపమాక వేంకటేశ్వర స్వామి ఆలయంలో సంక్రాంతినాడు ప్రత్యేక పూజలు జరిగాయి. గరుడాద్రి పర్వతంపై కల్కిఅవతారమైన స్వామివారి మూలవిరాట్‌కు తెల్లవారు జామున నాలుగు గంటలకు పంచామృతాలతో ప్రత్యేక అభిషేకం నిర్వహించారు. నిత్యార్చనలు పూర్తిచేసి భక్తులకు దర్శనం కల్పించారు. కొండ దిగువన వేణుగోపాల స్వామి ఆలయంలో, ఆండాళ్లమ్మవారి సన్నిధిలోను స్వామివారు ఉత్సవమూర్తుల వద్ద నిత్య సేవాకాలం, ప్రసాద నివేదన నిత్యహోమం, బలిహరణలు, సీరాజన మంత్రపుష్పాలు, తీర్థగోష్టి జరిగాయి. అనంతరం శ్రీ పద్మావతి, అలువేలుమంగా సమేతుడైన శ్రీ వేంకటేశ్వరస్వామివారిని రాజాధిరాజవాహనంలో, ఆండాళ్లమ్మ వారిని శేషతల్ప వాహనంలో తిరువీధి సేవలు నిర్వహించారు. హిందూ ధర్మ ప్రచారపరిషత్, తిరుమల తిరుపతి దేవస్థానం అన్నమాచార్య ప్రాజెక్టు వారి సంయుక్త ఆధ్వర్యంలో ఆలయంలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన కళాకారుల కోలాటం, సంకీర్తనలు అలరించాయి. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు.

సింహగిరిపై ముగిసిన ధారోత్సవాలు



స్వామిని, అమ్మవార్లను తిరువీధిగా తీసుకొస్తున్న అర్చకులు

సింహాచలం: సింహగిరిపై ధారోత్సవాలు సోమవారంతో ఘనంగా ముగిశాయి. శ్రీ వరాహలక్ష్మీనృసింహస్వామి ఉత్సవమూర్తులు గోవిందరాజ స్వామి, శ్రీదేవి,భూదేవిని,గోదాదేవి ఒక పల్లకీలో, మధన గోపాలస్వామిని వేరొక పల్లకీలో అదిష్ఠింపజేశారు. సువర్ణ అమ్మవారిని, చతుర్భుజ తాయారు అమ్మవారిని, ఆళ్వారులను మరో పల్లకీలో వేంచేయజేసి మేళతాళాల మధ్య ఆలయం నుంచి తిరువీధిగా గంగధార వద్దకు తీసుకెళ్లారు. అక్కడ విశేషంగా స్నపనం నిర్వహించారు. అనంతరం గంగధార వద్ద ఉన్న ప్రాచీన మండపంలో స్వామిని, అమ్మవార్లకు విశేష అలంకరణ చేశారు. పాశుర విన్నప పఠనం చేశారు. ఆలయ స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్,ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు,అర్చకులు సాతులూరి నరసింహాచార్యులు తదితరులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

సొరంగం వద్ద పటిష్ట భద్రత

- పోలీసులు, రెవెన్యూ సిబ్బంది పహారా
- పరిశీలించిన తహసీల్దార్.. కలెక్టర్‌కు నివేదిక
- పరిశీలించనున్న పురావస్తు శాఖ అధికారులు



మంగళవారం నాటికి మరింత బయల్పడిన సొరంగ మార్గం



సొరంగం వద్ద పహారా కాస్తున్న పోలీసులు, రెవెన్యూ సిబ్బంది

రావికమతం: కొమిర గ్రామంలో బయల్పడిన సొరంగం వద్ద పోలీసులు, రెవెన్యూ సిబ్బంది 24 గంటలూ పహారా కాస్తున్నారు. ఆ గ్రామంలో ఆదివారం ఇంటింటి కుళాయి పనులు చేస్తుండగా సొరంగం బయట పడిన సంగతి తెలిసిందే. దీనిపై సాక్షిలో సోమవారం వార్త ప్రచురితం కావడంతో రెవెన్యూ, పోలీసు అధికారులు స్పందించారు. తహసీల్దార్ మహేశ్వరరావు, రావికమతం ఎస్ఐ ఉమా మహేశ్వరరావు పరిశీలించారు. సొరంగం లోతుగా లోపల వెడల్పుగా ఉండటంతో ఎవ్వరినీ దిగకుండా తగిన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. సొరంగం చుట్టూ కంచె ఏర్పాటు చేశారు. సొరంగంపై ఇనుప చట్రాలను మూత వేయించారు. పండగ సమయం కావడంతో జన సంచారం ఎక్కువగా ఉంటుందని ఎవ్వరూ దిగే ప్రయత్నం చేయకుండా చూడాలని అక్కడి సిబ్బందికి ఆదేశించారు. దీనిపై ఒక నివేదికను జిల్లా కలెక్టర్‌కు పంపామని, అక్కడి నుంచి ఆదేశాలు వచ్చాక తదుపరి చర్యలు చేపడతామని అన్నారు. పురావస్తు శాఖ అధికారులు కూడా రెండు రోజుల్లో వస్తారని తెలిపారు.

రాజుల కాలంనాటిదే

కొమిర గ్రామంలో బయల్పడిన సొరంగం గురించి ఆదివారం సాక్షి పత్రికలో ప్రచురితం కావడంతో జిల్లా సమాచార శాఖ అధికారి సాయిబాబా ఆ వార్తను చదివి స్పందించారు. సోమవారం ఆయన సాక్షితో ఫోన్‌లో మాట్లాడారు. మాడుగుల స్వస్థలం కావడంతో ఆయన రాజుల కాలంనాటి సంగతులు పంచుకున్నారు. మాడుగులలో రాజుల కాలంలో ఈ ప్రాంతంలో ప్రవహించే నదులపై వంతెనలు ఉండేవి కావని, అత్యవసర సమయాలలో ప్రయాణం సాగించేందుకు, రహస్య సమాచారాలను చేరవేసేందుకు ఒకచోటి నుంచి మరొక చోటికి సొరంగాలు తవ్వి ఆ మార్గాల ద్వారా వెళ్లే వారని తమ పెద్దలు చెప్పేవారని, ఇదీ అటువంటిదై ఉంటుందని ఆయన అభిప్రాయపడ్డారు.

అంబరాన్నంటిన మకరజ్యోతి సంబరాలు

నర్సీపట్నం: స్వామి అయ్యప్ప సేవా సంఘం వారు నిర్వహించిన మకరజ్యోతి మహోత్సవాలు అంబరాన్ని తాకాయి. ఎన్టీఆర్ మినీ స్టేడియంలో నిర్వహించిన మకరజ్యోతి మహోత్సవాల్లో భాగంగా సాంస్కృతిక కార్యక్రమాలు చూపరులను విశేషంగా ఆకట్టుకున్నాయి. సినీ, టీవీ గజల్ గాయకుడు, నటుడు సత్యసాయి శ్రీనివాస్, వర్ధమాన గాయని పెదిరెడ్ల సుజాత పాల్గొన్నారు. గజల్ శ్రీనివాస్ ఆలపించిన గేయాలు ఆహూతులను ఎంతగానో ఉర్రూతలూగించాయి. పండగ రోజున మకరజ్యోతి మహోత్సవాల్లో పాల్గొనటం తమకెంతో ఆనందం కలిగిస్తుందని నటులు అన్నారు. సంక్రాంతి పండగ పర్వదినాన్ని పురస్కరించుకుని స్వామి అయ్యప్ప ఆలయంలో ఉదయం నుంచి స్వామివారికి విశేష పూజలు చేశారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని స్వామి వారికి పంచామతాభిషేకాలు జరిపించుకున్నారు. మధ్యాహ్నం నుంచి ఆలయ ఆవరణంలో విష్ణు సహస్ర నామపారాయణం, అవతార మెహర్‌బాబా సంకీర్తనలు, సత్యసాయి సంకీర్తనలు ఆలపించారు. సాయంత్రం చిడతల కోలాటాలు, భజనల మధ్య స్వామివారి రథయాత్ర అత్యంత వైభవంగా కొనసాగింది. మకరజ్యోతి మహోత్సవాలు ఉట్టిపడేలా భారీ ఎత్తున బాణసంచా కాల్చారు.

అయ్యప్పస్వామి ఆలయంలో మకరజ్యోతి వేడుకలు

అనకాపల్లి: స్థానిక గవరపాలెం వద్ద గౌరీపంచాయతన దేవాలయంలోని అయ్యప్పస్వామి మకర సంక్రాంతి వేడుకలు సోమవారం రాత్రి ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా కేరళ వాయిద్యాలు, మహిళల దాండియా, తప్పెడుగుళ్లు, కాంగో కోలాటలు వంటి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. మకరజ్యోతి దర్శనం వేడుకల్లో భాగంగా ఆలయ అర్చకులు పొందూరు సూర్యనారాయణ శాస్త్రీ, శేషు, సాయి మూల విరాట్ పంచామృత అభిషేకాలు, అయ్యప్ప స్వామికి వంద తులాల బంగారు ఆభరణాలు ఊరేగించారు. ఈ ఏడాది ప్రత్యేకంగా కాశీ హారతులు భక్తులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. స్వామి వారి ఊరేగింపు కార్యక్రమాన్ని ప్రారంభించి అయ్యప్పస్వామి 18 మెట్ల హారతులు చేపట్టారు.

కనులపండువగా గజేంద్రమోక్ష ఉత్సవం

- వరదరాజస్వామి అలంకరణలో దర్శనమిచ్చిన సింహాద్రి అప్పన్న
- గజవాహనంపై విశేషంగా తిరువీధి
- పరవశించిన భక్తజనం



స్వామి వారి తిరువీధి సేవ నిర్వహిస్తున్న అర్చకులు



కార్యక్రమానికి వచ్చిన భక్తులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామి గజేంద్రమోక్షం(మకరవేట) ఉత్సవం మంగళవారం కనుల పండువగా జరిగింది. ఆపదల్లో ఉన్నవారెవరైనా పిలిచిన వెంటనే ఏదొక రూపంలో భగవంతుడు వచ్చి రక్షిస్తాడని, మొసలి బారిన పడిన గజేంద్రుడి చరిత్రే దానికి నిదర్శనమని చాటిచెబుతూ ఈ ఉత్సవాన్ని ఏటా కనుమ రోజు నిర్వహించడం ఆనవాయితీ. కొండదిగువ పూలతోటలో సింహాచలం దేవస్థానం వైదికులు ఘనంగా నిర్వహించారు. ఉత్సవంలో శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి వరదరాజస్వామి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. స్వామిని కనులారా తిలకించిన భక్తులు.. భక్తి పారవశ్యంలో మునిగితేలారు. స్వామి ఉత్సవమూర్తి గోవిందరాజ స్వామిని వరదరాజస్వామి అలంకరణ చేసి.. సాయంత్రం సింహగిరి నుంచి మెట్లమార్గం ద్వారా కొండదిగువకు తీసుకొచ్చారు. తొలిపావంచా వద్దకు చేరుకున్న స్వామికి అడవివరం గ్రామస్తులు, దేవస్థానం అధికారులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం అక్కడి నుంచి స్వామిని ఆయన సోదరి అయిన అడవివరం గ్రామదేవత పైడితల్లి అమ్మవారి ఆలయం వద్దకు ఊరేగింపుగా తీసుకెళ్లారు. అక్కడ స్వామికి మహిళలు మంగళహారతులిచ్చారు. అక్కడి నుంచి స్వామిని పూలతోటకి తీసుకెళ్లి ప్రధాన మండపంలో అధిష్టింపజేశారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, షోడశోపచార పూజలు నిర్వహించారు. అనంతరం భాగవత పురాణ విన్నపం, గజేంద్ర మోక్షం ఘట్ట విన్నపం చేశారు. తదుపరి స్వామిని అక్కడి నుంచి పుష్కరిణి సత్రం వద్దకు తీసుకొచ్చి గజవాహనంపై అధిష్టించారు. అదే వాహనంపై రాత్రి గ్రామ తిరువీధి విశేషంగా చేపట్టారు. తమ ఇళ్ల ముందుకి వచ్చిన స్వామికి గ్రామస్తులు హారతులిచ్చారు. దేవస్థానం స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు, అర్చకులు సాతులూరి నరసింహాచార్యులు, చక్రవర్తి, చిన్నా తదితరులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. దేవస్థానం ఈవో ఎస్. శ్రీనివాసమూర్తి దంపతులు, ట్రస్ట్‌బోర్డు సభ్యులు గంట్ల శ్రీనుబాబు, వారణాసి దినేష్‌రాజ్ ఉత్సవంలో పాల్గొన్నారు. అధికారులు పక్కా ఏర్పాట్లు చేశారు. పూలతోటను పెద్ద ఎత్తున విద్యుద్దీపకాంతులతో అలంకరించారు. నార్త్ ఏసీపీ అన్నెపు నరసింహమూర్తి ఆధ్వర్యంలో గోపాలపట్నం పోలీసులు బందోబస్తు నిర్వహించారు. కాగా ఉత్సవాన్ని పురస్కరించుకుని పూలతోటలోని శ్రీకృష్ణ కొలను వద్ద మూడు సార్లు వెలిగించిన జువ్వలు మూడు వెళ్లి.. తిరిగి రావడంతో ఈ ఏడాది వరి, అపరాలు, మెట్ట పంటలు బాగా పండుతాయని భక్తులు విశ్వసించారు.